
# ప్రేమకథ

ఆకుండి నారాయణమూర్తి




"ఏమండీ. . . మీ కామెను చూస్తే ఏమనిపి స్తూంది?" అనడిగింది నీలవేణి. అలానన్నడిగిన నీలవేణి ఎవరో కాదు. సాక్షాత్తూ నా భార్య. ఇక్కడ "ఆమె" అను సర్వనామం "నీరజ"కు బదులుగా వాడబడింది. అప్పుడే మా ఇంటి నుంచి వెళ్ళి పోతున్న నీరజను చూస్తూ నన్నలా అడిగింది నా భార్య.

నా భార్య కేమని సమాధానం చెప్పాలో నా కర్థం కాలేదు. ఇంకెవరయినా ఇలా అడిగితే, "చాలా బాగుం దనిపిస్తూంది" అని టకీమని సమాధానం చెప్పేసుండే వాడిని. భార్య దగ్గిర ఎప్పుడూ పర స్త్రీ ప్రశంస చేయరాదని "అనుకూల దాంపత్యసారం" లోని మొదటి రూలు. ఈ రూలు ప్రకారం నే నామెను నా భార్య దగ్గిర ఎప్పుడూ ప్రశంసించ కూడదు.

"చెప్పరేం?. . . మీ కామెను చూస్తే ఏమనిపి స్తూంది?" నా ముఖంలోకి అదో లాగ చూస్తూ నిష్కర్షగా అడిగింది నీలవేణి.

ఇక ఏదో ఒక సమాధానాన్ని చెప్పకపోతే పరువు దక్కదని గ్రహించి, "ఏవి టే నువ్వడిగేది?. . . రోడ్డంటపోతున్న ఒక మగాడిని చూపించి, 'అతగాడిని చూస్తే నీ కేమనిపిస్తూంది?" అని నిన్ను నే నడిగితే నువ్వేమని సమాధాన మిస్తావు?" అనడిగాను దాడిని తిప్పి కొట్టాలనే సంకల్పంతో.

"నీరజ రోడ్డంట పోతున్న ఆడది కాదు. రోజూ ఏదో ఒక మిష పెట్టి మనింటికి వస్తున్న ఆడది, వచ్చి నాతో కన్నా మీతోనే గంటల తరబడి సరదాగా మాట్లాడుతున్న ఆడది. అందుకనే అడుగుతున్నాను, ఆమెను చూస్తే మీ కేమనిపిస్తూందని?" అని ఒక తర్క శాస్త్ర పండితురాలి లాగ అడిగింది.

"నిజం చెప్పమంటావా?. . . అబద్ధం చెప్ప మంటావా?"

"ఈ పాత సినీమా డైలాగుతో నన్ను మీరు మోసం చెయ్యలేరు. మీ రేం చెప్పినా అది నిజమో, అబద్ధమో తెలుసుకో గలిగే పాటి బుద్ధి బలం నా కుంది. చెప్పండి."

"అయితే నీ బుద్ధి బలం ఏ పాటిదో తెలుసుకోవాల నుంది నాకు... ఆమెను చూస్తూంటే నా కేమనిపి స్తూందో తెలుసా?. . . ప్రేమించాలనిపిస్తూంది" అని అన్నాను నవ్వకుండా. . . ఇక నా భార్య నాతో పోట్లాటకు సంసిద్ధురాలవుతుం దనుకున్నాను. సంసార మన్న తరవాత సరసంతో పాటు కించిత్తు విరసం కూడా ఉండాలని, అది లేకపోతే ఉప్పు లేని పప్పు లాగ జీవితం చాలా చప్పగా ఉంటుందని ఒక రూలుంది. ఆ రూలు గుర్తు కొచ్చి నా భార్యతో విరసానికి సంసిద్ధుడ నయాను.

ఆమె ముఖం అరుణారుణ మవుతుం దనుకున్నాను.
కాలేదు.

నోటి కొచ్చినట్లు పేలుతుం దనుకున్నాను.

పేలలేదు.

ఛీత్కారం చేస్తుం దనుకున్నాను.

చెయ్యలేదు.

కాని నవ్వింది. నవ్వి వంటింట్లో కెళ్ళిపోయింది.

ఆ నవ్వు కర్థ మేమిటి?

"నీ ముఖానికి ప్రేమించటంకూడానా?" అనే హేళ నుందా ఆ నవ్వులో?

ఎమర్జన్సీ ఇంకా కొనసాగినట్లయితే కంపల్సరీ రిటైర్‌మెంట్‌కు రికమెండ్‌చెయ్యవలసే వయస్సులో ఉన్న వాడికి ప్రేమేమిటనే నిరసన భావం ఉందా ఆ నవ్వులో?

ఆలోచించ సాగేను. . . అవి వయస్సు మళ్ళిన ఆలోచనలవడం వల్లనో ఏమో అంచక్కా నిద్ర పట్టేసింది.

నీలవేణి నా వీపుపై ఒక చరుపు చరిచి, "ఏవండోయ్. . . పగటి కలలు కనడం మానేసి ఇహ లేవండి మీ ప్రియురా లొస్తూంది." అంది.

నేను పాము లాగ తలెత్తి ఇటూ అటూ చూసి "ఎవరే ఆ ప్రియురాలు? నాకు నువ్వు తప్ప మరెవ్వరూ కనిపించ లేదు" అని అన్నాను.

"పెళ్ళాం ప్రియురా లెలా అవుతుంది?. . . నన్ను చూస్తేనే మీ కసహ్యం. . . అదుగో. . . మీరు ప్రేమించాలనుకుంటున్న నీరజ వస్తూంది. కాస్త నీటుగా ముస్తాబయి ప్రేమొలక బొయ్యండి దాని మీద" అని రుసరుస లాడుతూ వెళ్ళిపోయింది నీలవేణి.

నీరజ వచ్చింది. వస్తూనే నా మంచానికి ఎదురుగా ఉన్న కుర్చీ మీద కూర్చుంది. నా జిడ్డు ముఖంలోకి చూస్తూ, "ఇప్పుడే నిద్ర లేచినట్లున్నారు?" అంది.

"వూఁ!. . .ఇప్పుడే లేచేను.. ముఖం కడుక్కు వస్తాను" అని చెప్పి పెరట్లోకి వెళ్ళేను.

నేను ముఖం కడుక్కొని, టాయిలెట్ అయి ఆ గదిలోకి వచ్చేసరికి నా భార్య, నీరజ పకపక నవ్వుకుంటున్నారు! నన్ను చూసి నా భార్య టక్కున నవ్వడం మానేసి నాకేసి అదోలా చూసి అట్ల పెనంలాంటి ముఖంతో వెళ్ళిపోయింది వంటింటి వేపు.

నిరసనం అంటే అదే కాబోలనుకున్నాను!

"ఏమిటివాళ అదోలా ఉన్నారు!" సంభాషణ కుపక్రమించింది నీరజ!

"అబ్బే!. . .మామూలుగానే ఉన్నానే!" అని అన్నాను.

"లేదులెండి. ఏదో మార్పు ఉంది!. . .రోజులా ఇవాళ నాకేసి మీరు చూడలేకపోతున్నారు!" అంది.

మనస్సులోని భావాలు ముఖం మీద ముద్రింప బడతాయా, లేక థాట్ రీడింగ్ ఆమెకు చేతవునా? ఆలోచించసాగేను!

"నన్ను చూస్తూంటే మీకేమనిపిస్తూంది?" అని నీరజ నన్నడిగేసరికి తుళ్ళిపడ్డాను. బహుశా నీరజకు నా తత్త్వం గురించి, నా బుద్ధి గురించి, నా ధోరణి గురించి నీలవేణి చెప్పేసుంటుం దనుకున్నాను. చెప్పేసుండకపోతే నీరజ నన్నలా ఎందు కడుగుతుంది?

ఏం చెప్పాలో నాకు బోధపడలేదు!. . . ఏదో పరిహాసం కోసం నా భార్యకు చెప్పిన సమాధానాన్ని నీరజకు నేనెలా చెప్పగలను?

"సంశయిస్తున్నట్లున్నారు. నేనేమీ అనుకోను. నన్ను చూస్తూంటే మీకేమనిపిస్తూందో నిస్సంకోచంగా చెప్పండి." నీరజ నన్నొదిలి పెట్టేటట్లు లేదని గ్రహించేను. అయినా ఏమని సమాధానం చెప్పడమో దా కవతగం కాలేదు.

"ఇప్పుడు మీ వయస్సెంత?" అడిగింది నీరజ. టాపిక్‌ను ఆమే మార్చినందుకు మనస్సు లోపల ఆనందం కలిగింది నాకు.

"జాతకచక్రం ప్రకారం నలభై అయిదు. సర్టిఫికేటు ప్రకారం నలభై ఆరు!" అని సమాధానమిచ్చేను.

"సరే!. . .మీ వయస్సు నలభై అయిదు. మరి నా వయస్సు ఎంతుంటుం దంటారు?"

"ఇరవైకి, ఇరవై అయిదుకి మధ్య ఎంతైనా ఉండొచ్చు! ఇంతకీ మన వయస్సుల గురించి ఇప్పు డీ విషయ సేకరణ ఎందుకు?"

"ఎందుకంటే, ఇరవై ఏళ్ళ దానికి, నలభై అయిదేళ్ళవాడికి మధ్య ఎలాంటి సంబంధాన్ని పై నుండి చూసేవాళ్ళు వూహించగలరో మీ నోటి మీదుగా తెల్సుకుందామని!"

నే నేమన్నదీ నీరజకు నా భార్య చెప్పేసుంటుం దనే అనుమానం మరింత దృఢపడింది!. . .నీరజ ఎదుట కూర్చోడానికి సిగ్గేసింది నాకు!. . .తమాషా కోసమైనా అడకూడని పరిహాసా లెవరితోనూ ఆడ కూడదని తెల్సుకున్నాను.

నేను ఏ సమాధానం చెప్పకుండా మౌనంగా కూర్చోడంచూసి, "నేడు వెలువడుతున్న సినిమాలలో నటిస్తున్న మన హీరో, హీరోయినుల వయస్సులలో ఇంతకుమించిన అంతరం ఉన్నా, మన ప్రేక్షకులు వాళ్ళని ప్రేయసీప్రియులుగా చూడడానికి మనవాళ్ళు బొత్తిగా ఇష్టపడడం లేదు. ఏమంటారు? అని అడిగింది నీరజ.

నేనింకా ఏమీ అనకముందే—

"మీకు మొట్టమొదట ఒక కుమార్తె పుట్టి చనిపోయింది కదూ? ఆమె బ్రతికున్నట్లయితే సరిగ్గా నాలాగేనా అంతే ఉండేదని ఒకసారి మాటల సందర్భంలో అమ్మగారు చెప్పగావిన్నాను. నిజమేనా?" అనడిగింది నీరజ.

"వూఁ!. . .నిజమే!. . . అలాగే అనిపిస్తూంది నాకు!. . ." అని బయట కన్నాను. అంతట్లో నీలవేణి అక్కడకు వచ్చింది!

నీరజను నేను నా కూతురిలాగ ప్రేమించొచ్చు నని మనస్సులో అనుకున్నాను. నా మనస్సులోని మాటను నీలవేణికి తెలియజేశాను!

"అయితే మరి ఆలస్యమెందుకు?. . .మంచి సంబంధం చూసి నీరజకు వేగంగా పెళ్ళి చేసెయ్యండి!" అని సన్నాదేశించింది నీలవేణి.

తమాషా ఏమిటంటే, నీరజను నే నే విధంగా ప్రేమించవచ్చో, నీరజే నాకు తెలియజెయ్యడం! *

